
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ,  స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# గ్రహణం

"మేమ్ ! నేను చందాని మాట్లాడుతున్నాను, ఇప్పుడే బయలుదేరాను మీ ఇంటికే, మరో గంటలో అక్కడుంటాను. సీ యూ మేమ్" అంటూ చెప్పింది ఫోన్లో అమ్మాయి.

అన్నట్టుగానే మరో గంటకి బెల్ కొట్టిన ఆ అమ్మాయిని తలుపు తీసి ఆహ్వానించింది సంధ్య. 'గెట్ లుక్ 'అనే బ్యూటీసర్వీసెస్ సంస్థనించి వచ్చింది చందా. మనకి అవసరమున్నప్పుడు, కావలసిన సర్వీస్ లు ఎంచుకుని ఆన్ లైన్ లో కానీ, ఫోన్ ద్వారా కానీ బుక్ చేసుకుంటే ఇంటికే వచ్చి మనకి కావలసినవన్నీ చేసి వెళతారు. ఈ మధ్యన ఇలాంటివి వచ్చాకా పార్లర్ కి కూడా వెళ్ళక్కరలేకుండానే ఇంట్లోనే హాయిగా చేయించుకోవచ్చు. వెయిటింగ్ ఉండదు, శ్రమ లేదు. అందుకనే సంధ్యా, ఆమె స్నేహితురాళ్ళు కొందరు ఈ మధ్యన ఇదే పాటిస్తున్నారు.

"రండి !"అంటూ గ్రవుండ్ ఫ్లోర్ లో ఉన్న బెడ్ రూం లోకి దారి తీసింది సంధ్య.

"మేమ్ ముందు ఇది చేస్తాను, ఆ పైన ఇది" అంటూ తన ప్లాన్ చెప్పింది. సంధ్య సరేనంది.

"కాళ్ళు వేడి నీళ్ళల్లో పెట్టండి మేమ్!" అంటూ తన వెంట తెచ్చుకున్న టబ్ లో వేడినీళ్ళని చెత్తో ముట్టుకుని చూస్తూ "వేడి సరిపోయిందా మేమ్?" అంది.

సంధ్య సరిపోయిందన్నట్టుగా తల ఊపింది. ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

గుండ్రటి ముఖం, తెల్లగా పేరుకి తగ్గట్టుగా చందమామలా ఉంది చందా. కొద్దిగా బొద్దుగా ఉంది. చిన్న కళ్ళు, మెరుస్తున్న మెత్తటి నల్లటి జుట్టు. నవ్వుతూనే ఉంది వచ్చినప్పటినించీ. కానీ ఆ నవ్వువెనక ఉన్న దిగులు ఆమె కళ్ళల్లో కనిపిస్తూనే ఉంది.

మంచం పక్కనే ఉన్న టేబిల్ మీద ఉన్న సంధ్య కొడుకు ఫోటో చూసి అడిగింది చందా " మీ అబ్బాయా మేమ్?" అని.

" అవును, చిన్నప్పటిది, అప్పుడు వాడికి ఏడేళ్ళు" అంది సంధ్య

" నా కొడుకు కూడా ఇలాగే ఉంటాడు" అంది చందా..

చూడ్డానికి చిన్నపిల్లలా , పాతికేళ్ళు కూడా దాటని ఆ పిల్లకి " అంత కొడుకున్నాడా?" అనుకుంటూ అదే మాట అడిగింది

" హా, మేమ్! ఒకడు కాదు, ఇద్దరు కొడుకులు" అంది చందా..

" అవునా? నీకెన్నేళ్ళు?" అడిగింది సంధ్య ఆశ్చర్యంగా..

" ఇరవై ఐదు" అంది చందా ఎటో చూస్తూ..

" ఇరవై ఐదేళ్ళకే ఇద్దరు కొడుకులా? ఈ రోజుల్లో పెళ్ళిళ్ళే చేసుకోవడం లేదు ఎవరూ ఆ వయసుకి" అంది సంధ్య.

" అవును మేమ్. చదువు లేక, బుద్ధి లేక, నేను చేసిన పని అది. అందుకే ఇప్పుడు అనుభవిస్తున్నాను" అంది. ఆ పిల్ల చిన్న కళ్ళల్లో మెరిసిన తడి.

" అరే, అనవసరంగా నిన్ను బాధ పెట్టానా? పరవాలేదులే తొందరగా పెద్దవాళ్ళయిపోతారు. అప్పుడు నువ్వూ, నీ భర్తా హాయిగా ,మధ్యవయసుని ఎంజాయ్ చెయ్యచ్చు" అంది అనునయంగా.

" హు ! భర్త!నాతో ఉంటేగా మేమ్! లైఫ్ ఎంజాయ్ చెయ్యడానికి" అంది వేడినీళ్ళల్లో నానిన సంధ్య కాలు శుభ్రం చెయ్యడానికి చేతిలోకి తీసుకుంటూ.

" అంటే? " ఊరుకోలేక అడిగింది.

" ఆయన మాతో ఉండదు మేమ్ ! అతను ఢిల్లీలోనే ఉంటాడు. మరో పెళ్ళి చేసుకున్నాడు నాలుగేళ్ళ క్రితమే! ఆ తర్వాతే నేను పిల్లలని తీసుకుని బెంగుళూరు వచ్చేశాను" అంది దిగులుగా.

సంధ్య మనసంతా చేదు తిన్నట్టుగా అయిపోయింది. నిండా పాతికేళ్ళు లేని పిల్ల. ఎంత బాధ్యత? అనుకుంది.

"అయ్యో! అలాగా? సారీ!" అని మాత్రం అనగలిగింది.

" పర్వాలేదు మేమ్! నాకిలా కావలసిందే! పెద్దలు చెప్పిన మాట వినకుండా పిచ్చి పట్టినదాన్లా ప్రవర్తించాను కదా అప్పుడు. సిటీ మీద మోజుతో తెలిసీ తెలియనివయసులో చేసిన తప్పుకి ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నాను. పిల్లలకి దూరమై, పని తప్ప మరో లోకం లేకుండా" అంది. ఆ మాటలంటూ ఉంటే చెప్పలేని వేదనతో ఆమె కళ్ళనిండా నిండిన నీళ్ళు..

సానుభూతిగా చూసింది సంధ్య. మనసులో బాధ ఎవరో ఒకరితో పంచుకోవాలనో, లేక సంధ్య మార్దవంగా మాట్లాడడమే ఆమెని కదిలించిందో తెలీదు కానీ చందా పని చేస్తూనే తన కథ చెప్పడం మొదలు పెట్టింది.

మాది డెహ్రాడూన్ దగ్గరలోని ఒక చిన్న పల్లెటూరు. ప్రకృతి పరిమళం తప్ప మరో వికారం తెలియని బాల్యం నాది. ఆడుతూ, పాడుతూ మా ఊర్లో ఉన్న చిన్న బడికి వెళ్ళడం, వచ్చాకా అమ్మకి సహాయం చెయ్యడం, అమ్మతో కబుర్లు చెప్పడం, స్నేహితులతో ఆటలు.. ఇంతే నా ప్రపంచం. మొదటి సారి మా పిన్ని గారింటికి ఢిలీ వెళ్ళేవరకు.

చాలా రోజులవరకూ అమ్మా, నాన్నలకి నేనొక్కర్తినే సంతానం. బాగా లేట్ గా నాకో చెల్లెలూ, తమ్ముడూ పుట్టారు. అప్పటివరకూ నేనాడింది ఆట, పాడింది పాట. మా చెల్లెలు కడుపులో ఉన్నప్పుడు అమ్మకి బాగా సుస్తీ చేస్తే మంచి డాక్టర్లుంటారని నేను, అమ్మా మా పిన్ని దగ్గరకి ఢిల్లీ వెళ్ళాము. దాదాపు నా వేసవి శలవులంతా అక్కడే ఉండిపోయాము.

ఆ విశాలమైన వీధులు, రక రకాల కార్లు, విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న షాపులూ ఢిల్లీ నాకెంత నచ్చిందో నేను చెప్పలేను. నా పన్నెండేళ్ళ వయసుకి అదో అద్భుతం, నేనెన్నడూ చూడని, కథల్లో చదివిన స్వర్గం అంటే ఇదే అనిపించసాగింది. వెనక్కి మళ్ళీ మా ఊరు వెళ్ళాలన్న ఊహే నాకు చిరాగ్గా అనిపించడం మొదలు పెట్టింది.మెల్లిగా అదే మాట అమ్మతో అనడడం మొదలు పెట్టాను.

" అక్కడేముంది అమ్మా! బాబాని కూడా ఇక్కడికొచ్చేయమందాం! హాయిగా ఇక్కడే ఉండిపోవచ్చు కదా!" అంటూ..

అమ్మ నవ్వేది తప్ప అవునూ, కాదూ అనేది కాదు. దాంతో నాకు కోపం వచ్చేది.

అలిగి అన్నం మానేస్తే అమ్మో, పిన్నో బ్రతిమాలి అన్నం పెట్టేవారు. అలా చూస్తుండగానే మూడునెలలు గడిచిపోయాయి. గులాబి పువ్వులా అందంగా పుట్టిన చెల్లెలినిచూసి మురిసిపోయాము అందరూ.. 'గులాబ్' అని నేనే పేరు పెట్టాను.

ఊరికి తిరుగు ప్రయాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. అప్పుడు మాత్రం నేను రానని భీష్మించుకుని కూర్చున్నాను.

నా హఠం చూసి పిన్నే అంది " పోనీలే అక్కా, నీకూ చిన్నపిల్లతో చేసుకోవడం కష్టమే కదా! ఇక్కడే స్కూల్లో వేద్దాం, నా పిల్లలతో పాటు చదువుకుంటుంది. అదొక్కర్తీ నాకు బరువేమీ కాదు"అని.

ఆ మాట విని నేను ఎగిరి గంతేసాను. పెద్దచదువులు మా ఊరిలో ఉండవు కనక ఇదీ బాగానే ఉంది అనుకున్నారు నాన్న కూడా.. హాస్టల్ లో పెట్టి చదివించే స్తోమత లేదు కనక పిన్ని చెప్పిన సలహా అందరికీ నచ్చింది. వెంటనే మా ఊరువెళ్ళి అన్నీ సర్దేసుకుని నెలరోజులకల్లా పిన్ని ఇంట్లో వాలిపోయాను.

రోజూ బస్ స్టాప్ దాకా నడిచి పిన్ని కొడుకులిద్దరితో కలిసి బస్ ఎక్కి స్కూల్ కి వెళ్ళడం, శలవురోజున దగ్గర్లోని పార్కులకి వెళ్ళడం లాంటివన్నీ ఎంతో బావుండేవి నాకు. మొదట్లో బాగానే చదివేదాన్ని కూడా, అజ్జూ పరిచయం అయ్యేంతవరకూ.

అజ్జూ, అదే నా భర్త అజిత్ చిత్రంగా పరిచయం అయ్యాడు. అప్పటికే స్కూల్ మానేసిన అతను పెద్దగా పనేమీ లేకుండా తిరుగుతూ ఉండేవాడు. వాళ్ళ నాన్నకో చిన్న షాపుండేది, అప్పుడప్పుడూ దాన్ని చూసుకుంటూ, మిగతా టైములో సినిమాలు చూస్తూ, స్నేహితుల వెంట తిరుగుతూ ఉండేవాడు. మనిషి మాత్రం సినిమా హీరోలా ఉండేవాడు.

నేనొక సారి పిన్ని కొడుకులతో సినిమాకి వెళ్ళినప్పుడు మాకు టిక్కట్లు దొరకలేదు, అప్పుడు 'నేను తెచ్చిస్తాగా!' అంటూ తెచ్చి ఇచ్చాడు. అప్పుడే పరిచయం మాకు. పిన్ని ఇంటివెనకే వాళ్ళుంటారనీ, తను మమ్మల్ని చూస్తూనే ఉంటాడని చెప్పాడు. అలా మొదలైన మా పరిచయం సినిమాలకేమీ తక్కువకాకుండా త్వరలోనే ప్రేమగా మారింది.

అజ్జూ చెప్పే కబుర్లన్నీ నాకెంతో గొప్పగా ఉండేవి. అతన్ని కలవడం కోసం నా తమ్ముళ్ళకి స్పెషల్ క్లాస్ లున్నాయని చెప్పి ఆలస్యంగా వచ్చేదాన్ని. వాళ్ళు పాపం అమాయకులు! నా మాటలు నమ్మేసేవారు, అదే మా పిన్నికి చెప్పేవారు. ఆవిడ తన ఇంటి పనీ, వంట పనీ, తీరిక వేళల్లో స్వెటర్లు అల్లి అమ్ముతూ ఉండే పనిలో ఎప్పుడూ బిజీగా ఉండేది.

ఒకటి రెండు సార్లు నన్ను అడిగినా నేను ఏదో ఒక సమాధానం చెప్పి తెలివిగా నెగ్గుకొచ్చేదాన్ని. ఈలోపున నాకో తమ్ముడు పుట్టాడు. పిన్ని వాళ్ళు కూడా ఢిల్లీ నగరపు ఖర్చులు భరించలేక ఎదైనా చిన్న ఊరికి మారుదామని ఆలోచిస్తున్నారు.

అజూకి దూరమైపోతానన్న బెంగ మొదలైంది నాకు, అదీ కాక మళ్ళీ పల్లెటూరికి వెళ్ళాలన్న ఊహే భరించలేకపోయేదాన్ని కూడా.

" నువ్వు బాగా చదువుకుని, మంచి ఉద్యోగం చేస్తూ చక్కగా ఉండాలి. తమ్ముడూ, చెల్లెలూ నిన్ను చూసి నేర్చుకుంటారు. మీ బాబా, నేను నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం, నీ భవిష్యత్తు కోసమే పిన్ని దగ్గర ఉంచాము. నీకు తెలుసుకదా, వాళ్ళ పరిస్థితీ అంతంత మాత్రమే! అదీ కాక బాబా కి ఆరోగ్యం బాగుండటం లేదు కూడా, పెద్దవారయిపోతున్నారు" ఇలా ఉత్తరాలు రాసేది అమ్మ.

అజ్జూ ప్రేమ మత్తులో నాకవన్నీ ఏమీ ఎక్కేవి కాదు. దానికి తోడు అజ్జూ చెప్పే మాటలు, చూపించే కలలూ.. నన్నుపూర్తిగా ఒక రకమైన మత్తులో పడేశాయి.

వాళ్ళ అమ్మ కూడా ఎంతో ప్రేమగా మాట్లాడేది నాతో. ఆవిడ తరచూ 'ఆడపిల్లలు చక్కగా చిన్నవయసులో పెళ్ళి చేసుకోవాలని, ఉద్యోగాలు అవీ అంటూ తిరగడం మొదలు పెడితే అన్ని చోట్లా కష్టాలే తప్ప మరేమీ ఉండవనీ' అంటూ ఉండేది. పైగా ఉద్యోగం చేసే ఆడపిల్లలకి తల్లి తండ్రులు ఒక పట్టాన పెళ్ళి చెయ్యరనీ, వాళ్ళ బాధ్యతలకీ, సరదాలకీ వీళ్ళని వాడుకుంటారనీ ఇలా ఏవేవో చెప్పేది. ఆవిడెందుకలా చేసేదో నాకిప్పటికీ అర్ధం కాదు కానీ అప్పుడు ఆవిడ చెప్పినవన్నీ అక్షరసత్యాలుగా అనిపించేవి.

ఆవిడ మాటలని అమ్మ ఉత్తరాలకి అన్వయించి చూసుకుంటే నిజమే అనిపించేది కూడా. అమ్మా, బాబా నా క్షేమాన్ని తప్ప మరేమీ కోరరని తెలుసుకోలేకపోయాను.

అందుకే అజ్జూ " చూశావా, మా అమ్మ చెప్పలేదు, మీ అమ్మ ఎప్పుడూ నువ్వు చదువుకుని ఉద్యోగం చెయ్యాలి, నీ తమ్ము డికి, చెల్లి కి అండగా ఉండాలి అంటుందే తప్ప నువ్వు పెళ్ళి చేసుకుని సుఖంగా ఉండాలి! అనిఒక్కసారైనా రాసిందా? అక్కడే అర్ధమవడం లేదూ వాళ్ళ స్వార్ధం ! మీ వాళ్ళ వల్ల కాదు కానీ, మనం హాయిగా పారిపోయి పెళ్ళి చేసేసుకుందాం" అనగానే గంగిరెద్దులా తలూపాను.

కన్న తల్లి తండ్రులకి కానీ, కన్న తల్లిలా చూసుకుంటున్న పిన్నికి గానీ చెప్పకుండానే అతనితో పాటు వెళ్ళి దగ్గరున్న గుడిలో పెళ్ళి చేసుకున్నాను.

ఆ విషయం తెలుసుకున్న పిన్ని హతాశురాలైపోయింది. అజ్జూతోటి, వాళ్ళ అమ్మ తోటి పోట్లాడింది. "పెద్దదానివి నీకైనా బుద్ధిలేదా? చిన్నపిల్ల, పదిహేనేళ్ళు లేవు, దానికి పెళ్ళేమిటి? నన్ను నమ్మి మా అక్క దాన్ని నా దగ్గర పెట్టింది,ఇప్పుడేమని సమాధానం చెప్పగలను దానికి?" అని గొడవచేసింది, ఏడ్చింది.

విషయం తెలిసి వెంటనే మా అమ్మా, నాన్న వచ్చారు. నాన్న నన్ను అదే మొదటి సారి కొట్టడం.

" నిన్ను చదువుకోమని పంపితే ఇదా నువ్వు చేసే నిర్వాకం? ఇప్పటినించీ పెళ్ళి చేసుకుని ఏం సాధిస్తావే? నీ బుద్ధి గాడిదలు కాసిందా? మేమతా చచ్చామనుకున్నావా? రోజూ అన్నం పెట్టి అమ్మలా ఆదరించిందే? దానికైనా ఒక్క మాట చెప్పలేకపోయావా? నీ అంతట నువ్వే నిర్ణయాలు తీసేసుకునేంత పెద్దదానివయిపోయావా?" అంటూ తిట్టారు, బాగా కొట్టారు.

అయినా అదేమిటో మొండిదాన్ని ఇసుమంత బెదరలేదు నేను. అజ్జూ యే నా లోకం అన్నాను, మీరు ఎప్పుడూ నా క్షేమం అడగలేదన్నాను, నేను ఉద్యోగం చేస్తూ ఉంటే మీరు హాయిగా అనుభవించవచ్చు అని మీ ప్లాన్" ఇలా చాలా అన్నాను మేమ్! అంటూ, చేస్తున్న మసాజ్ ఆపేసి చేతుల్లో ముఖం దాచుకుని ఏడవడం మొదలు పెట్టింది..

" ఊరుకో చందా!" అంది సంధ్య పేపర్ నేప్కిన్ అమెకిస్తూ.

" సారీ మేమ్! ఎందుకో  తెలియకుండానే మీకు నా కథ చెప్పాలనిపించింది. అనవసరంగా మీ టైం వేస్ట్ చేస్తున్నాను అక్కరలేని విషయాలు చెప్పి" అంది దిగులుగా.

" పర్వాలేదు, నీ మనసులో ఎప్పటినించో పేరుకుపోయిన బాధ ఇది, పంచుకుంటే తేలికవుతుంది, నాకేమీ పర్వాలేదు, నీకు చెప్పాలనిపిస్తే మిగతా కథ కూడా చెప్పు" అంది సంధ్య ఆమె చేతిమీద చెయ్యి వేసి అనునయంగా నొక్కుతూ.

" ఆ పైన పెద్దగా చెప్పడానికేమీ లేదు మేమ్. ప్రేమ పేరుతో వంచనకి గురైన ఎందరో అమాయకురాళ్ళలాంటిదే నా కథ కూడా. అందరినీ ఎదిరించి పదిహేనేళ్ళ వయసులో అజ్జూ వెంట వాళ్ళింటికి వెళ్ళిపోయానా? అప్పటినించి అతను నన్ను కాదని రెండో పెళ్ళి చేసుకునేవరకూ అంటే దాదాపు నాలుగేళ్ళు, రోజుకోరకమైన బాధ, కష్టం.

“మనింటి పని మనమే చేసుకోవచ్చు, ఇద్దరం ఉన్నాం కదా, పని అమ్మాయిని వద్దని చెప్పేస్తా! అంది మా అత్త, నేను వెళ్ళిన మూడో రోజే, నాలుగో రోజునించి ఆ ఇంటికి పనిమనిషిని, వంట మనిషిని అయ్యాను. ఎంత చేసినా తరగని పని, కొడలు కూర్చుంటే సహించలేని గుణం. ఇంటిపట్టున ఉండని భర్త. ఇద్దరు మరుదులూ, మావగారు. అత్తగారి తల్లి. ఇంతమందికీ మూడుపూట్లా వంట, ఇంటి పనులు. మధ్యలో ఖాళీ దొరికితే అత్తగారికో, ఆవిడ తల్లికో కాళ్ళకీ, తలకీ మసాజ్ లు, వాళ్ళ చీరలకి ఫాల్స్, అద్దకాలు కుట్టడాలు. విస్త్రీ చెయ్యడాలు ఇలా ఒక దాని వెంట మరొకటి పనే తప్ప మరొకటి ఉండేది కాదు.

మా అత్తకి నోరే కాదు, చెయ్యీ ఎక్కువే! ఏ పనైనా ఆవిడనుకున్నట్టు చెయ్యకపోయినా, ఆవిడ మాటకెదురు చెప్పినా కొట్టేది. ఆవిడనెవ్వరూ ఏమీ అనేవారు కాదు ఇంట్లో. ఇక ఎదురు చెప్పడానికి ఎవరికీ సాహసం లేదు.

వెంట వెంటనే ఇద్దరు కొడుకులు. కొడుకులని కన్నందుకు కాస్త కనికరం చూపించింది మా అత్త, మా ఇంట్లో అందరూ మగపిల్లలే, మా వంశపు గొప్పే అది అని అందరికీ మిఠాయిలు పంచింది. పదిహేడేళ్ళకే ఇద్దరు పిల్లల తల్లినయ్యాను. ఇంటిపనికీ, ఒత్తిడికీ మానసికంగా, శారీరికంగా అలసిపోయి నీరసించిపోయాను.

మా బాబా నా మీద కోపంతో అసలు ఎప్పుడూ రాలేదు, నాతో మాట్లాడలేదు. అమ్మ మాత్రం కడుపు తీపి ఆపుకోలేక రెండు మూడు సార్లు వస్తే గుమ్మంలోనే అవమానించి పంపేసింది మా అత్త.

" కూతురు పెళ్ళి చెయ్యలేనివాళ్ళు, దానంతట అది చేసుకుంటే చూసి ఆనందిచలేనివాళ్ళు ఉన్నా, చచ్చిన వాళ్ళతో సమానం, మీ పిల్ల బానే ఉంది, మరో సారి మా ఇంటికొస్తే మర్యాదగా ఉండదని ముఖానే చెప్పేసింది. పైగా ఓ అచ్చటా, ముచ్చటా లేదు, ఓ కానీ కట్నం లేదు, చూపులకొచ్చావా? అనేసరికి అమ్మ తట్టుకోలేకపోయింది.  మూడో సంవత్సరం లో మొదలైంది నన్ను ఇష్టపడి పెళ్ళి చేసుకున్నందువల్ల అజ్జూ కి రావలసిన కట్నం రాలేదనే విషయం మీద రచ్చ. అది రోజూ ఏదో ఒక మిషన చెప్తూ, సాధించేది నన్ను.

‘వాడికొచ్చే కట్నంతో మరో దుకాణం పెడదామనుకున్నాను. నీ వల్ల అది గండి కొట్టింది,’ అంటూ మొదలుపెట్టింది.

“నువ్వు నిజంగానే చందమామవి, అంత అందంగా ఉంటావు కనకే నీకు చందా అని పేరు పెట్టారు’ అంటూ ప్రేమ కబుర్లుచెప్పిన అజ్జూ కూడా తల్లి మాటలకే వత్తాసు పలికేవాడు.

అప్పుడర్థమైంది నాకు వాళ్ళ ఆలోచన. తెలిసిన వారిద్వారా అజిత్ కి గవర్నమెంట్ లో చిన్న ఉద్యోగం వచ్చింది, దానికి ఇచ్చిన లంచాన్నీ, అది ఇచ్చే గౌరవాన్ని కట్నం రూపంలో వసూలు చేసుకోవాలని వాళ్ళ ఆలోచన. దానికోసమే అతనికి తిరిగి సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. మరో నెలరోజులకే వాళ్ళు అనుకున్న సంబంధం దొరికింది. అది తెలిసిన నేను మొదటిసారి గొడవచేసాను. అప్పటి వరకూ అన్నీ మౌనంగా భరించిన నేను ఎదురుతిరిగేసరికి అజ్జూకి, వాళ్ళ అమ్మకీ విపరీతమైన కోపం వచ్చింది.

" నీకు అడ్డేముంది? నువ్వు ఎప్పటిలాగే ఉంటావు మనింట్లో" అంటూ మొదట నెమ్మదిగా చెప్పచూసిన మా అత్త మాటకే నేను ఎదురుతిరిగాను.దాంతో ఆవిడ కాళికే అయింది.

" నువ్వు అరిచినా, ఏడ్చినా ఈ పెళ్ళి జరిగేది ఖాయం. నోరుమూసుకుని పడి ఉంటే నీకు, పిల్లలకీ ఇంత ముద్ద పడేస్తాను, లేదంటే నీ దారి నువ్వు చూసుకోవల్సి వస్తుంది. ఈ మహానగరంలో ఈ పసివాళ్ళిద్దరినీ తీసుకుని ఎక్కడికి వెళతావో, ఏం చేస్తావో నీ ఇష్టం. అంతేకానీ రాజాలంటి నా

కొడుక్కి వచ్చిన గొప్ప సంబంధాన్ని అడ్డుకుంటే మాత్రం నీ అంతు చూస్తాను" అంది విపరీతమైన కోపంతో. ఆరోజు తలుచుకుంటే ఇప్పటికీ నాకు భయం వేస్తుంది.

అజ్జూ దగ్గర చెప్పి ఏడ్చాను. మాకు అన్యాయం చెయ్యవద్దన్నాను.

" పిచ్చిదానా, ఇందులో అన్యాయం ఏముంది? నువ్వుఎప్పటిలాగే ఉంటావు. నీకిద్దరు పిల్లలనిచ్చినట్టే ఓ చెల్లెలినిస్తున్నా" అంటూ వెటకారంగా నవ్వాడు. ఆపైన అమ్మ చెప్పినట్టు విని బుద్ధిగా ఉండు, బ్రతుకుంటుంది ! అని హెచ్చరించాడు. అప్పుడొచ్చింది నాకు కోపం.అదే కోపంతో అతని చెంప పేలిపోయేట్టు ఒక్కటిచ్చాను.

మరో మాటకి అవకాశం లేకుండా నా పిల్లలనిద్దరినీ తీసుకుని ఆ సాయంత్రం వేళ ఆ ఇంట్లోంచి బయటపడ్డాను. చేతిలో పది రూపాయలు లేవు, రెండు చేతులూ పట్టుకున్న చిన్న పిల్లలు తప్ప. నా మెడలో ఉన్న ఒక్క గొలుసు అమ్మి వచ్చిన డబ్బుతో టిక్కట్లు కొనుక్కుని మా ఊరు వెళ్ళిపోయాను. అప్పటికే బాబా పోయారుట, నాకు తెలీనే లేదు. చిక్కి సగమైపోయిన నన్ను అమ్మ అక్కున చేర్చుకుంది. ఒక్క సారి కూడా తిట్టలేదు, ఛీ అనలేదు.

" అదో పీడ కల అనుకో చందా!" అంటూ ధైర్యం చెప్పింది. కాదని మా ఇద్దరికీ తెలుసు.నాలుగురోజులాగాకా ఏంచెయ్యాలా అని ఆలోచించాం. అప్పుడర్థమయింది నాకు, జీవితం లో మొదటిసారి. తగినంత చదువులేని, చేతిలో ఏ విద్యాలేని, కుటుంబం యొక్క ఆలంబన లేని ఇద్దరు ఆడవాళ్ళు నలుగురు పిల్లలని పోషించడం ఎంత కష్టమో! దాదాపు అసంభవం అని.

కానీ ఓడిపోదల్చుకోలేదు. ఒకరికోకరు ధైర్యం చెప్పుకున్నాం. తెలిసిన వారి సలహా మేరకు ఉన్నవన్నీ అమ్ముకుని పొట్ట పట్టుకుని బెంగుళూరు వచ్చాము. ఇక్కడే నేను బ్యూటీషియన్ కోర్స్ శిక్షణలో చేరాను. అమ్మ కూడా దగ్గరలోని ఒక మాల్ లో హౌస్ కీపింగ్ లో చేరింది. ఖర్చులు చూస్తే కొండంత, ఆదాయం గోరంత. అందుకనే మరో దారిలేక పిల్లలు నలుగురినీ మా ఊరిదగ్గరలోని టవున్ లో మాకు తెలిసిన వారు నడిపే స్కూల్లో, హాస్టల్ లో వేశాము. వాళ్ళు మాకు ఫీజ్ తగ్గించి సీట్లు ఇచ్చారు. ఇద్దరమూ పని కి వెళ్ళిపోతాం కనక వాళ్ళని చూసుకోవడానికెవరూ ఉండరు కదా మేమ్! నలుగురూ కలిసి అల్లరి, క్రమశిక్షణ లేకుండా అవుతున్నారు, అందుకని ఇదే మంచిదనుకున్నాం. ఆరునెలలకొకసారి అమ్మా, ఆరునెలలకొకసారి నేను వెళ్ళి చూసి వస్తాము." అంది..

" అరే, అంత దూరం లో వేశావా? చిన్న పిల్లలు కదా, బెంగ పెట్టుకోరూ?" అంది సంధ్య బాధగా. పాతికేళ్ళు లేని పిల్లకి ఎన్ని చూపించింది జీవితం అనుకుంది మనసులో

" పెద్దవాడు పరవాలేదు మేమ్, చిన్న వాడు మాత్రం ఏడుస్తాడు నన్ను చూసినప్పుడల్లా, బాధని దిగమింగుకుని వాడు టీచర్లతో బిజీగా ఉన్న సమయం చూసి వచ్చేస్తూ ఉంటాను. వాళ్ళ భవిష్యత్తు బావుండాలనే కదా! ఇలా చేసింది. నా జీవితం చేజారిపోయింది, కనీసం వాళ్ళకి మంచి బ్రతుకునివ్వాలనే నా ప్రయత్నం"అంది.

పొద్దున్నంతా మాల్ లో పని చేస్తుంది అమ్మ, ఆ పైన రెండు మూడు ఇళ్ళల్లో సాయంత్రం వంట చేస్తుంది. నేనుకూడా రోజంతా దాదాపు పదిహేను గంటలు పనిచేస్తాను. వారానికొకరోజు శలవు మాకు ఆరోజు నాకు తెలిసిన వారి ఇళ్ళకి వెళ్ళి పార్లర్ సర్వీస్ చేస్తాను. ఇలా కష్టపడితే కొన్నాళ్ళలో తప్పకుండా మా ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని, వాళ్ళని మా దగ్గరకి తెచ్చేసుకోవాలనే మా ఆశ. అప్పటివరకూ ఈ త్యాగం తప్పదు మేమ్ " అంది.

"మొదటే అన్నాను కదా మేమ్! దీనికంతటికీ కారణం నేను చేసిన తప్పే! తెలిసీ తెలియని వయసులో వేసిన తప్పటడుగే!" అంది చందా భారంగా నిట్టూరుస్తూ సంధ్య ముఖానికి పాక్ వేస్తూ.

"అలా అనకులే చందా, తప్పు చెయ్యనివారెవరు? చేసిన తప్పుకి కుమిలిపోతూ, ప్రతీ క్షణం పరిస్థితులతో రాజీపడుతూ బాధపడడం ఒక్కటే మార్గం కాదు అని తెలుసుకుని ఎదుర్కోవడానికి నిర్ణయించుకున్నావు చూడు! ఆరోజే నీ తప్పు సమసిపోయింది అనుకో! నీ ధైర్యమే నీకు రక్షణ, మీ అమ్మ ఆలంబన మరింత ప్రేరణ. ఇది నీ జీవితంలో వచ్చిన తాత్కాలిక గ్రహణం. గ్రహణం వీడిన చంద్రుడిలా నీ జీవితం మళ్ళీ ప్రకాశిస్తుంది. ఇలాగే ఉండు, నువ్వనుకున్నవన్నీ సాధిస్తావు. ఇంతకంటే ఏం చెప్పగలనో, నీకెలా సహాయం చెయ్యగలనో కూడా నాకు తెలియడం లేదు. నాకు తెలిసిన వాళ్ళతో

చెప్పి ఇక్కడెక్కడైన దగ్గరలో మీ పిల్లలకి స్కూల్, హాస్టల్ దొరుకుతాయేమో అని ప్రయత్నిస్తాను. కనీసం అంత దూరం వెళ్ళే శ్రమ తప్పుతుంది. ఇంతకన్నా ఏం చెయ్యగలను?" అంది దిగులుగా.

"నిజంగానా మేమ్! ప్లీజ్ ప్రయత్నించండి. ఇక్కడెవరూ తెలియక, ఈ ఖర్చులు భరించలేకే అంత దూరాన ఉంచాను వాళ్ళని. మీరు ఈ సహాయం చెయ్యగలిగితే మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను" అంది సంధ్య చేతిని మెత్తగా స్పృశిస్తూ.

" తప్పకుండా ప్రయత్నిస్తా" అంది సంధ్య స్థిరంగా, ఆ మాటకే చంద్రబింబంలా వెలుగుతున్న చందా గుండ్రటి ముఖాన్ని చూస్తూ.

COMMENTS